# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రపంచ దేశాలు భాగస్వామ్యం కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
- ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిణామాలతో దేశీయ మార్కెట్ కి సవాల్ ఎదురవుతోందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.
- సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు.
- రానున్న నాలుగైదు రోజులలో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయని భారతీయ వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

========================

'ఒక భూమి కోసం.. ఒక ఆరోగ్యం కోసం యోగా' అనే అంశంతో ఈ సంవత్సరం జూన్ 21వ తేదీన భారత్‌లో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో పాల్గొనాలని ప్రపంచ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరుగుతున్న 78వ ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ సదస్సును ఉద్దేశించి ఢిల్లీ నుంచి ఈ రోజు ఆయన దృశ్య మాధ్యమం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... దేశంలో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకమని పేర్కొన్నారు. భారత్‌లో 58 కోట్ల మందికి ఉచిత చికిత్సను అందిస్తున్నామని వెల్లడించారు. ఈ పథకాన్ని ఇటీవలే 70 సంవత్సరాలకు పైబడిన భారతీయులకూ విస్తరించామని చెప్పారు. "ఒకటే ప్రపంచం... ఒకటే ఆరోగ్యం..." అన్న ఉమ్మడి భావనతో ఎన్నో ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాలకు భారత్ సహకారాన్ని అందించిందని ప్రధానమంత్రి గుర్తు చేస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

=======================

భారతదేశం-నెదర్లాండ్స్ దేశాల మధ్య దృఢమైన భాగస్వామ్యం ఉందని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ అన్నారు. కేంద్రమంత్రి ఈరోజు హేగ్‌లో నెదర్లాండ్స్ ప్రధాన మంత్రి డిక్ స్కూఫ్‌ను కలిశారు. నెదర్లాండ్స్ ప్రధాన మంత్రితో సుహృద్భావ వాతావరణంలో సమావేశం జరిగిందని సామాజిక మాధ్యమం ద్వారా ఆయన వెల్లడించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నెదర్లాండ్స్ దృఢమైన వైఖరిని వ్యక్తం చేయడం పట్ల కేంద్రమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

=======================

ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిణామాలతో దేశీయ మార్కెట్ కి సవాల్ ఎదురవుతోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (CCI) 16వ వార్షిక దినోత్సవాన్ని ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ... ఈ కీలక సమయంలో మార్కెట్ నియంత్రణ స్వేచ్ఛ మధ్య సరైన సమతుల్యత అవసరమని చెప్పారు. మార్కెట్ లో పోటీని సజీవంగా ఉంచడంలోనూ భారత ఆర్థిక వ్యవస్థను క్రియాశీలకంగా చేయడంలోనూ CCI ముఖ్య పాత్ర పోషిస్తోందని అన్నారు. 2047 నాటికి భారతదేశం వికసిత్ భారత్‌గా మారాలని ఆకాంక్షిస్తున్నామని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్)

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

=======================

రానున్న నాలుగైదు రోజులలో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయని భారతీయ వాతావరణ శాఖ (ఐఎండీ) ఈరోజు వెల్లడించింది. సాధారణంగా జూన్ ఒకటో తేదీన నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయి. ఇక ఈ సంవత్సరం అనుకున్న దానికన్నా ముందే నైరుతి రుతుపవనాలు కేరళ తీరంతో పాటు దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతాలకు చేరనున్నట్లుగా అంచనా వేస్తున్నట్లుగా ఐఎండీ పేర్కొంది. దీంతో ఈసారి భారీ వర్షపాతం దేశవ్యాప్తంగా నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

=======================

సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. డిపో దర్పణ్ పోర్టల్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్, అన్నా మిత్ర, అన్నా సహాయత పేరుతో మూడు ప్రధాన డిజిటల్ కార్యక్రమాలను ఢిల్లీలో ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రజా పంపిణీ వ్యవస్థను సమూలంగా మార్చడమే కాకుండా పేదలకు చేరువ చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు. ప్రధానంగా పారదర్శకతను పెంపొందించడంతో పాటు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కోసం కృషి చేస్తున్నామని వెల్లడించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద దేశవ్యాప్తంగా 81 కోట్లకు పైగా ప్రజలకు సబ్సిడీ ఆహార ధాన్యాల పంపిణీ జరుగుతోందని కేంద్రమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 28 సెకన్లు)

========================

దేశం మొత్తం భారత సాయుధ దళాలకు రుణపడి ఉంటుందని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ అన్నారు. భారత సైనికులకు సంఘీభావం తెలియచేస్తూ... పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఈరోజు తిరంగ యాత్ర జరిగింది. ఈ సందర్భంగా హాజరైన తరుణ్ చుగ్ మాట్లాడుతూ...  పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా దేశ జవాన్లు ఆపరేషన్ సిందూర్ ని విజయవంతంగా నిర్వహించి శత్రువులని హడలెత్తించారని గుర్తు చేశారు. భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగాలు ఎనలేనివి అని అన్నారు. కాగా తీరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

========================

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ లో చేరాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వైస్ ఛాన్సలర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులను కోరారు. దేశవ్యాప్త ప్రచారంగా ఈ నెల 29వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నదని తెలిపారు. న్యూఢిల్లీలో వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ICAR) సంస్థల డైరెక్టర్ల సమావేశంలో ఈ రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శాస్త్ర ఆధారిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే  కేంద్రప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, వ్యయాన్ని తగ్గించడం అన్నది ఒక విధానంగా అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వ్యవసాయ సంస్థల ఉమ్మడి కృషితోనే వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధ్యపడుతుందని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 31 సెకన్లు)

========================
========================